నవనందుల దర్శనం.. పాపహరణం

- దేవతలతో ప్రతిష్ఠితమైన లింగాలు
- నందుల పాలనలో వైభవం
- కార్తీక పౌర్ణమిన దర్శనానికి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తుల రాక



నవనందులను దర్శించుకొనే రూట్ మ్యాప్

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దేవతలతో ప్రతిష్ఠించబడిన నవనందులు నందవంశ చక్రవర్తుల ద్వారా అభివృద్ధి చెందాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఏడాది అధిక మాసం రావడంతో ఈనెల 26న ఉదయం కార్తీక పౌర్ణమి గడియలు ప్రారంభమై 27వ తేదీ మధ్యాహ్నం ముగుస్తుండటంతో రెండు రోజుల పాటు భక్తులు నవనందులను దర్శించుకుంటారని వేదపండితులు పేర్కొంటున్నారు. ఉదయం కార్తీక స్నానం ఆచరించి నవనందులు దర్శిస్తే కాశీలో విశ్వేరుడిని దర్శించినంత పుణ్యం లభిస్తుందని, భూమండలాన్ని తిరిగివచ్చిన ఫలితం ఉంటుందని, సర్వపాపాలు తొలుగుతాయని భక్తులకు ప్రగాఢ విశ్వాసం. అందుకే కార్తీక మాసంలో పౌర్ణమి సందర్భంగా నవనందుల దర్శనానికి భక్తులు అధిక ప్రాధాన్యతనిస్తారు. ఇందుకు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా నవ నందులను దర్శించుకుంటే తమ కోరికలు నెరవేరుతాయని వారి నమ్మకం. పాదయాత్రగా దర్శించుకునే వారు మొదట పట్టణంలోని గుడిపాటిగడ్డలోని మల్లికార్జునస్వామిని తెల్లవారుజామునే కార్తీక స్నానాలు ఆచరించి ఉపవాస దీక్షతో దర్శించుకొని తిరిగి నవనందులను సందర్శించుకొని సాయంత్రం మళ్లీ స్వామిని దర్శించుకుంటారు. అందుకే ఈ మల్లికార్జునస్వామి..సాక్షి మల్లికార్జునుడిగా పేరుగాంచారు. కాశీక్షేత్రాన్ని దర్శించుకోలేని వారు సాక్షి మల్లికార్జునస్వామిని దర్శించుకుని నవనందుల ప్రదక్షిణలు చేస్తే అదే ఫలితం కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.



సాక్షి మల్లికార్జునస్వామి

ప్రథమనంది..



నంద్యాల పట్టణానికి నైరుతి దిశలో చామకాల్వ ఒడ్డున వెలిసింది. ఇక్కడి లింగాన్ని లక్ష్మి, సరస్వతిదేవి ప్రతిష్ఠించారని ఐహిత్యం. ఉత్తరాయన కాలంలో సూర్యకిరణాలు స్వామివారిని స్పర్శిస్తాయని వేదపండితులు చెబుతున్నారు. ఇక్కడ గాయత్రిదేవి అమ్మవారు పూజలు అందుకుంటున్నారు.

నాగనంది...



పట్టణంలో బైటిపేట ఆంజనేయస్వామి దేవాలయంలో ఉమాసమేత నాగనందిగా నెలకొన్నారు. పూర్వం నాగ జాతి గరుడుడి దాడిని తట్టుకోలేక ఇక్కడ పరమేశ్వరుడి అనుగ్రహం కోసం నాగేంద్రుడు తపస్సు చేయడం వల్ల నాగజాతిని కాపాడబడిందని, అందుకే నాగనందీశ్వరస్వామిని ప్రతిష్ఠించారు. ఈ నందిని పూజిస్తే నాగదోషాలు, సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం.

సోమనంది...



ఆత్మకూరు బస్టాండ్ వద్ద సోమనంది ఆలయం నెలకొల్పబడింది. చంద్రుడికి మరో పేరు సోముడు. చంద్రుడు ప్రతిష్ఠించిన ఈ ఆలయాన్ని సోమనందీశ్వరస్వామి ఆలయంగా పిలువబడుతుంది.ఇక్కడచంద్రుడు తప్పు చేసినట్లు స్థానిక చరిత్ర. శివుడిని ఎంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారో ఇక్కడ నందిని కూడా అలాగే పూజిస్తారు.

శివనంది...



బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలో శివుడే స్వయంభువుగా ఏర్పడి శివనందిగా పేరొందింది. ఈ నందిని రుద్రనందిగా కూడా పిలువబడుతుంది. ఈ దేవాలయాలు తంజావూరు శిల్పకళలచే ఐదు దేవాలయాలు నిర్మించబడ్డాయి. శివనంది త్రేతాయుగం కాలంలో ప్రతిష్ఠింపబడిందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయులు ఈ దేవాలయాన్ని దర్శించుకున్నట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. ఐదవ శతాబ్దంలో రెండవ పులకేసికి శివుడే స్వప్నంలో శివనంది ఆలయాన్ని ప్రతిష్ఠాంచాలని ఆదేశించారని చరిత్ర చెబుతుంది. ఈ దేవాలయంలో శ్వేతనాగులు ఉండటంతో రాహుకాల దోష నివారణ పూజలు నిర్వహిస్తుంటారు.

విష్ణునంది...



బండిఆత్మకూరు మండలం నల్లమల అటవీ ప్రాంతంలో స్వయాన మహావిష్ణువు శివుడి కోసం తపస్సు చేసి ప్రసన్నం చేసుకొని విష్ణునందిని ప్రతిష్ఠించారని శాసనాలు తెలుపుతున్నాయి. శివకేశవుల కలయికనే ఈ విష్ణునంది. అన్ని దేవస్థానాల్లో నవగ్రహాలను ఈశాన్యం వైపు ప్రతిష్ఠిస్తారు. కాని ఇక్కడ రుగ్వేదానుసారం నవగ్రహాలను ఆగ్నేయ దిశలో ప్రతిష్ఠించి వారికి వాహనాలు కూడా ఏర్పాటు చేశారు.గురువుకు ఐరావతం వాహనం, శనికి దున్నపోతు వాహనంగా ఉండటం ప్రత్యేక.

వినాయకనంది..



మహానంది దేవస్థానానికి దక్షిణ భాగాన వినాయకనంది వెలసింది. స్వయాన వినాయకుడే శివుడి కోసం తపస్సు చేసి వినాయకనందిని స్థాపించాడని పురాణాలు చెబుతున్నాయి.

మహానంది...



మహానంది గోమాత పాద గుర్తులతో శివలింగం భక్తులకు దర్శనమిస్తుంది. ఈ శివలింగం అడుగు భాగం నుంచి వచ్చిన నీరు నంది నోటి నుంచి రుద్రగుండంలోకి అంతర్వాహినిగా ప్రవహిస్తూ నేటికీ అంతుచిక్కని రహస్యంగా మారింది.

గరుడనంది...



మహానందికి పడమటివైపున గరుడనందిని గరుత్మంతుడే స్వయంగా ప్రతిష్ఠించారట. భక్తులు సర్పదోష నివారణ కోసం పూజలు నిర్వహిస్తారు.

సూర్యనంది...



మహానంది మండలంలో సూర్యుడు శాప విమోచన కోసం ఇక్కడ తపస్సు చేసి సూర్యనందిని ప్రతిష్ఠించడం వల్ల సూర్యనందిగా పిలువబడుతుంది. ఉత్తరాయన కాలంలో ఉదయం వేళల్లో సూర్యకిరణాలు స్వామివారిని స్పర్శిస్తుంటాయి.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రుద్రవరం: స్థానిక తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన మహీధర్ యాదవ్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్ అండర్-19 లాంగ్ జంప్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరావు శనివారం తెలిపారు. ఇటీవల కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీకలు ఎంపిక చేశారని, ఈ నెల 27,28,29 తేదీల్లో నర్సారావుపేటలో జరిగే పోటీల్లో కర్నూలు జట్టు తరపున పాల్గొంటాడని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

ఆళ్లగడ్డ: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మంగళగిరికి చెందిన బసవరాజు పేర్కొన్నారు. జగనన్న మళ్లీ సీఎం కావాలని ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు బసవరాజు చేపట్టిన పాదయాత్ర శనివారం ఆళ్లగడ్డ నియోజకవర్గం చేరుకుంది. పలువురు వైఎస్సార్ సీపీ కార్యాకర్తలు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

దొర్నిపాడు: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలవాలని రాష్ట్ర మాజీ ఎస్సీ కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరాజు చేపట్టిన పాదయాత్ర శనివారం దొర్నపాడు మీదుగా కోవెలకుంట్లకు వెళ్లారు. చేరుకుంది. మండల కేంద్రానికి చెందిన తాలుకా బీసీ సంఘం నాయకుడు బత్తుల కృష్ణయ్య యాదవ్ ఆయనకు మద్దతు తెలిపారు. బసవరాజు మాట్లాడుతూ తాము పాదయాత్రగా వెళ్తుండగా దారిలో పొలాల్లో ఉన్న కూలీలు, రైతులు తమ ఓటు జగనన్నకే అని చెబుతున్నారని చెప్పారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ జూనియర్ కళాశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఐఈఓ సునీత, రాష్ట్ర దళిత సేవా సంఘం అధ్యక్షుడు కొమ్ముపాలెం శ్రీనివాసులు మాట్లాడుతూ మన రాజ్యాంగం ప్రపంచ దేశాల్లో ఖ్యాతి గాంచిందన్నారు. కరస్పాండెంట్ స్వరూపారాణి, ప్రిన్సిపాల్ దివాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటలక్ష్మమ్మకు జాతీయ పురస్కారం



పురస్కార గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ మల్లెపోగు వెంకటలక్ష్మమ్మకు విమల సాహితీ జాతీయ పురస్కారం లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శనివారం తెలిపారు. కళాశాలలో ఆమెకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 19న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పురస్కారాన్ని అందజేశారని చెప్పారు. అవార్డును పద్మశ్రీ గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, గోరేటి వెంకటన్న, కోటేశ్వరరావు, డాక్టర్ జెర్సీ విద్యాధర్‌రావు చేతుల మీదుగా అందుకున్నట్లు ఆమె వివరించారు. అకాడమీ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, గంగాధర్ అవార్డు గ్రహీతను అభినందించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై హర్షం




ఎంపీ పోచాను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించడంపై ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి, ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు మణిశేఖర్‌రెడ్డి, హుసేన్‌రెడ్డి శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగుల వ్యతిరేకి అయిన స్టేట్ ఆడిట్ డైరెక్టర్ హరికిషన్‌ను బదిలీ చేయించిన ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని కలిసి ఎన్‌జీఓ నాయకులు అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. నాయకులు మునిశేఖర్, అల్తాఫ్, రాముడు, సత్యనారాయణ, నర్సారెడ్డి, సుబ్బరాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

జీవో రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): డీఈఓ కార్యాలయాల్లో పనిచేసే ఏడీలకు మాత్రమే డీఈఓగా పదోన్నతి కల్పించాలని ఇచ్చిన జీవో నంబరు 282ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ జీవో వల్ల సీనియర్ హెచ్‌ఎంలు, డైట్ లెక్చరర్లు, ఎంఈఓలకు భవిష్యత్‌లో డీఈఓ పదోన్నతుల్లో అన్యాయం జరుగుతుందన్నారు. భాస్కరరెడ్డి, జగదీష్, సుమయూన్, జేసీ నరసింహులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



వృద్ధురాలికి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని చిత్రేనిపల్లె, ముకుందాపురం గ్రామాల్లో శనివారం ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్‌నాథ్ రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండు గ్రామాల్లో 106 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



లబ్ధిదారుడికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 10వ వార్డులో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ అబ్దుల్‌మజీద్‌తో కలిసి నిర్వహించారు. ముందుగా వార్డులో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారికి పథకాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి పథకాల వర్తింపు, లబ్ధి, జగనన్న పాలనను టీడీపీ ప్రభుత్వ పాలనతో పోల్చి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు సాదిక్‌బాషా, కలాం బాషా, సమ్మద్, కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా, నాయకులు లక్ష్మీనారాయణ, కత్తిశంకర్, కిరణ్‌కుమార్, రహంతుల్లా, గన్నికరీం,గోపాల్‌రెడ్డి, జాకీర్, అమీర్‌బాషా పాల్గొన్నారు.

గైర్హాజరైన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలోని అన్ని మండలాల ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యలో బడి ఈడు పిల్లల నమోదు సర్వే వంద శాతం పూర్తయిందని, ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి జీఈఆర్ సర్వేపై థర్డ్ పార్టీ టీం ద్వారా వెరిఫికేషన్ జరగనున్న నేపథ్యంలో పాఠశాలలకు గైర్హాజరవుతున్న పిల్లలను తిరిగి పాఠశాలలకు పంపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యార్థుల గైర్హాజరు, తాత్కాలికంగా వలస వెళ్లిన విద్యార్థుల వెరిఫికేషన్‌పై ఎంపీడీఓలు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 రోజుల నుంచి దాదాపు 17,900 మంది పిల్లలు పాఠశాలలకు రావడంలేదని సర్వేలో వెల్లడైన నేపథ్యంలో సంబంధిత ఎంఈఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను ప్రోత్సహించి పిల్లలను పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే తాత్కాలికంగా వలస వెళ్లిన కుటుంబాలు, గత సర్వేలో మిస్సయిన కుటుంబాలలోని పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి పిల్లలు బడిమానేయకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రోజుకు ఎంతమంది పిల్లలను చేర్పించారో రోజువారి నివేదికలను సమర్పించాలని డీఈఓ సుధాకర్ రెడ్డికి సూచించారు.

అన్ని సదుపాయాలతో చిన్న చెరువు పార్కు



టూరిస్ట్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, ఎమ్మెల్యే శిల్పా,ఎంపీ పోచా

నంద్యాల: పట్టణంలోని చిన్న చెరువు గట్టుపై టూరిస్ట్ రెస్టారెంట్‌ను పునరుద్ధరించడంతోపాటు అధునాతన సదుపాయాలతో కూడిన పార్కును ప్రారంభించామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం పునరుద్ధరించిన టూరిస్ట్ రెస్టారెంట్, పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా చిన్న చెరువు పార్కును ప్రారంభించే కార్యక్రమంలో మంత్రి బుగ్గనతో పాటు ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ గ్రీన్ కో ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులు ఆకర్షించే రీతిలో ఉన్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌ను అభినందించారు. ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ దాదాపు రూ.1.26కోట్లతో చిన్న పార్కును అభివృద్ధి చేసి అన్ని రకాల మౌలిక సదుపాయాలు సమకూర్చామని చెప్పారు.

మాతా శిశు మరణాలను అరికట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: గర్భిణులు,బాలింతలు, 5 ఏళ్ల లోపు వయస్సున్న శిశువుల మరణాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. శనివారం స్థానిక సర్వజన ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విదులు నిర్వహిస్తున్న ఎంపీహెచ్,ఎంపీహెచ్‌ఈఓ, పీహెచ్‌ఎన్,సీహెచ్‌ఓ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల పరిధిలోని వారి వివరాలను ఆర్‌సీహెచ్, హెచ్‌ఎంఐఎస్ పోర్టల్లలో అప్ లోడ్ చేయాలన్నారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావునాయక్, డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వసతుల కల్పన

ఆళ్లగడ్డ: టిడ్కో ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతుల కల్పన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని టిడ్కో క్వాలిటీ కంట్రోల్ ఈఈ ఆదినారాయణ తెలిపారు. పట్టణంలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో వసతుల కల్పనకు జరుగుతున్న పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాంట్రాక్ట్ పనులు చేపడుతున్న పలువురు కంపెనీల నిర్వాహకులతో మాట్లాడుతూ చేస్తున్న పనుల్లో నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇళ్లలో చేరిన వారికి ఇబ్బంది లేకుండా అవసరమైన మేరకు నీరు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ వసతి కల్పించామన్నారు. పనులు మరో నెలలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామని చెప్పారు. డీఈ రవికుమార్ గుప్తా, ఏఈఈలు వెంకటరమణ, నాయక్, ప్రసాద్ ఉన్నారు.

చెంచుల సాధికారతే లక్ష్యం

నంద్యాల(అర్బన్): చెంచుల సాధికారతే లక్ష్యంగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు స్మార్ట్ ట్రైబల్ ఫార్మింగ్ క్లస్టర్ యూనివర్సిటీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నీరజ తెలిపారు. నేషనల్ వైడ్ ప్రాజెక్టు కింద క్లస్టర్ యూనివర్సిటీ, వీఆర్‌ఓ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో చేపట్టబోతున్న చెంచుల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలంటూ శనివారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌ను ఆమె కలిశారు. అనంతరం మహానంది మండలం చెంచుల లక్ష్మి గూడెంలో చెంచుల జీవన స్థితి గతులను తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ చెంచుల పురోగతిపై తయారు చేసిన నివేదికలను కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ, స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసింహారెడ్డి, ప్రొఫెసర్ సాయిగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చి మాట నిలబెట్టుకున్నాం



పెద్దకంబలూరులో మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: సాధారణ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నవరత్నాలతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలు చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దకంబలూరులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇళ్ల వద్దకు వెళ్లి వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందజేసిన లబ్ధిని వివరించారు. వివిధ పథకాల రూ.13.98కోట్లను గ్రామస్తుల ఖాతాల్లో తమ ప్రభుత్వం జమ చేసిందని వివరించారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలని అక్కడేనున్న అధికారులను ఆదేశించారు. ఇవన్నీ కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎం గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎర్రం నర్సిరెడ్డి,రామసుబ్బారెడ్డి,రవిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దారు రవీంద్రప్రసాద్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి ,ఏపీఎం కల్పలత, ఎంఈఓ శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఏఈలు రాఘవేంద్రారెడ్డి, వెంకటరాముడు, ప్రమోద్, ఏపీఓ ప్రతాప్, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాదరెడ్డి, నాయకులు శీను, దేగాని వెంకటేష్,వినోద్,హరినారాయణ,కో ఆప్షన్ సభ్యులు మదార్ సాహెబ్,రమణారెడ్డి పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాల కొనసాగింపు



హరివరంలో పథకాలను వివరిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగుతాయని ఎంపీటీసీ సభ్యుడు పెద్దపేరయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని హరివరం గ్రామ ఎస్సీ కాలనీలో సర్పంచ్ నడిపి వెంకటన్న, సచివాలయ కన్వీనర్ సూదుల దస్తగిరిరెడ్డి, నాయకులు గండా శంకర్‌రెడ్డితో కలిసి ప్రతి ఇంటిని సందర్శించి మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్‌ను అందజేసి, వారు పొందిన సంక్షేమ లబ్ధిని వివరించారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు

నంద్యాల(వ్యవసాయం): విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా ఉండాలని కోరుతూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఉక్కు సత్యాగ్రహం సినిమా రూపొందించామని సినీ హీరో సత్యారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక శ్రీనివాస కాంప్లెక్స్‌లోని ఎన్‌వీఎస్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

మంచి నడవడిక అలవర్చుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): క్రైస్తవులు మంచి నడవడిక అలవర్చుకోవాలని నంద్యాల డయాసిస్ రిటైర్డు బిషప్ ఎగ్గోని పుష్పలలితమ్మ సందేశం ఇచ్చారు. శనివారం పట్టణంలోని ఆల్ సెయింట్ చర్చ్ (పాస్టరేట్-2) ఆలయం రెండవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో డీసరీ చైర్మన్ ఇమ్మానియేల్, విజయ్‌కుమార్, జోయల్, సెక్రటరీ కిరణ్‌కుమార్, ట్రెజరర్ బాలన్న, బైబిల్ సొసైటీ సెక్రటరీ కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు..

పట్టణంలోని బర్న్స్ ఆవరణలో శనివారం సాయంత్రం క్రిస్మస్ ముందస్తుగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసరీ చైర్మన్ ఇమ్మానియేల్ గురువులు సపోజ్ క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. అనంతరం యువకులు, స్త్రీల మైత్రి సభ్యులు, సండేస్కూల్ పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ధాన్యం దొంగల అరెస్ట్

రుద్రవరం: బయలు ప్రదేశంలో ఆరబోసిన ధాన్యాన్ని ట్రాక్టరులో ఎత్తుకెళ్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ..కొండమాయపల్లెకు చెందిన సింగతల భాస్కరెడ్డి తన పొలంలో కోతలు కోయించిన వరి ధాన్యాన్ని పక్కనే ఉన్న పాత వెలగలపల్లె గలుగు ప్రదేశంలో ఆరబోశారు. రాత్రి ఆ ధాన్యాన్ని కుప్పగా పోసి పట్టలు కప్పి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక కొండమాయపల్లెకు చెందిన నందివర్ధన్, దస్తగిరి, మనోజ్, సింహ అనే నలుగురు ట్రాక్టరుతో వెళ్లి ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. బాధిత రైతు ఫిర్యాదుతో దాడి చేసి నలుగురు దొంగలతో పాటు ధాన్యం ఉన్న ట్రాక్టరును పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామానికి చెందిన హిదయతుల్లా(25) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హిదయతుల్లా కొంత కాలంగా కడుపునొప్పి, అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఉరికి వేలాడుతున్న కుమారుడిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి అక్బర్ వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ మద్దిలేటి చెప్పారు.

విధుల్లో చేరిన వైద్యాధికారి



డాక్టర్ నవీన్

రుద్రవరం: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా నవీన్ శనివారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఇద్దరిలో ఒకరు ఉన్నత చదువులకు, మరొకరు సెలవుపై వెళ్లడంతో డాక్టర్ల స్థానాలు ఖాళీగా మారాయి. వాటిని భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులు నవీన్‌ను నియమించారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

నంద్యాల(అర్బన్): జస్టిస్ ఉషా మెహరా కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్రంలోని షెడ్యూల్ కులాల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ కోరారు. వచ్చే నెల 4 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టేలా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపాలంటూ శనివారం వారు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. నాయకులు రవికిరణ్, కృష్ణ, లక్ష్మయ్య, సుబ్బయ్య, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని చక్కటి ప్రణాళికతో సాధించాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనందకుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీరామకృష్ణ పీజీ డిగ్రీ కళాశాలలో 76వ ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలు నిర్వహించి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవమని, అంతర్జాతీయ శాఖాహార దినోత్సవమని గుర్తు చేశారు. అమ్మాయిలు కూడా ఎన్‌సీసీలో ప్రావీణ్యం పొందాలన్నారు. అనంతరం నంద్యాల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారంతో 36మంది రక్తదానం చేశారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వరలక్ష్మి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ హరిబాబు,ఎన్‌సీసీ కెప్టెన్ లలితా సరస్వతి పాల్గొన్నారు.